సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం । 25 । డిసెంబర్ । 2023



శ్రీకృష్ణుడిగా..గోవర్ధనగిరిధారిగా
యాదాద్రి అధ్యయనోత్సవాల్లో భాగంగా శ్రీస్వామి వారు శ్రీకృష్ణుడిగా, గోవర్ధన గిరిధారిగా దర్శనమిచ్చారు. - 8లో



ఉపాధికి బాట
రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జనరల్ గ్రూపులతో పాటు ఒకేషనల్ కోర్సులను అందజేస్తున్నారు. - 9లో



వ్యవసాయ కూలీలుగా..
చదువుకోవాలనే ఆకాంక్ష ఉన్నప్పటికీ.. ఆ విద్యాకుసుమాలు వ్యవసాయ కూలీలుగా మారారు. - 10లో

న్యూస్‌రీల్

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తుమ్మల నాగేశ్వర్‌రావు

నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమించింది. నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును నియమించింది. కాగా జిల్లాకు చెందిన రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించారు. అలాగే భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులయ్యారు.

సీఎం దృష్టికి తీసుకెళ్తా



ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కానిస్టేబుల్‌కు ఎంపికైన అభ్యర్థులు

చౌటుప్పల్ : కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని ఆదివారం మునుగోడు క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తక్షణమే మెడికల్ టెస్టులు నిర్వహించి శిక్షణకు పంపించేలా చూడాలన్నారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో కట్ట ఉదయ్‌కిరణ్, శివకృష్ణ, జి.శ్రీకాంత్, వినయ్‌కుమార్, మహేష్, సీహెచ్.శ్రీకాంత్, బోయ రాజు, సంతోష్‌కుమార్, నవీన్, తదితరులు ఉన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

భువనగిరి రూరల్ : జిల్లాలోని ఆరు మండలాల్లో విధించిన భూ పంపిణీ నిషేధాన్ని ఎత్తివేసి నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కందమడుగు నర్సింహ కోరారు. భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెంలో ఆదివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్కారు భూములను పేదలకు పంచకపోగా.. ఆనాటి ప్రభుత్వాలు పంపిణీ చేసిన భూములను గుంజుకుందని ఆరోపించారు. పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ సర్కారు సెంట్ భూమి కూడా పేదలకు పంచలేదని, ఇళ్ల స్థలాలు కూడా ఇవ్వలేదన్నారు. ముత్తిరెడ్డిగూడెంలోని 259 సర్వే నంబర్‌లో ఉన్న 500 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు కొండా అశోక్, కొండమడుగు నాగమణి, కూకుట్ల కృష్ణ, కొండా లక్ష్మయ్య, కాసారం మల్లయ్య, హైమవతి, కూకుట్ల చొక్కాకుమారి పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో జాప్యం చేయొద్దు



మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

సంస్థాన్ నారాయణపురం : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలను జాప్యం చేయకుండా అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ కోరారు. ఆదివారం సంస్థాన్ నారాయణపురంలో జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు ఇతర హామీలన్నీ నెరవేర్చాలన్నారు. సమావేశంలో నాయకులు తుమ్మల నర్సిరెడ్డి, దోనూరి నర్సిరెడ్డి, దోడ యాదిరెడ్డి, శ్రీనివాసాచారి, బాలకృష్ణ, నర్సింహ, యాదవరెడ్డి, శంకరయ్య, లింగస్వామి, భిక్షపతి, అంజయ్య, లాలయ్య, సుదర్శనాచారి పాల్గొన్నారు.

తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులు

భువనగిరిటౌన్ : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో భువనగిరి విద్యార్థులు సత్తా చాటారు. శ్రీపాద అద్విత సిల్వర్, శరణ్య గోల్డ్, లహరిరెడ్డి కాంస్య పతకం సాధించారు. విద్యార్థులను తైక్వాండో గ్రాండ్‌మాస్టర్ కృష్ణ, మాస్టర్ రాధ అభినందించారు.

● క్రిస్మస్‌కు ముస్తాబు



క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన భువనగిరిలోని టీచర్స్ కాలనీలో గల పునీత జోజప్ప దేవాలయం



భువనగిరిలోని తాతానగర్ మున్నాచర్చిలో ఏర్పాటు చేసిన క్రీస్తు జనన దృశ్యమాలిక

మంత్రి కోమటిరెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు

నల్లగొండ: తన ప్రేమతత్వంతో విశ్వమానవాళికి వెలుగులు పంచిన ఏసుక్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా క్రైస్తవులందరికీ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రేమ,సేవాతత్వం, కరుణ, త్యాగం, క్షమాగుణం వంటివి మానవ సమాజానికి అందించిన క్రీస్తు జన్మదినం ఎంతో పవిత్రమైనదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతామని పేర్కొన్నారు. ఈ క్రిస్మస్ క్రైస్తవుల జీవితాల్లో వెలుగులు నింపాలని, క్రిస్మస్‌ను ప్రతి కుటుంబం సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

కల్తీకి అడ్డుకట్టేదీ?

రోజుకో చోట బయటపడుతున్న కల్తీ పాలు
- రసాయనాలతో తయారీ
- హైదరాబాద్‌లోని హోటళ్లు, స్వీట్‌హౌజ్‌లు, గృహాలకు రోజూ వేల లీటర్ల సరఫరా
- ప్రజారోగ్యానికి పొంచి ఉన్న ముప్పు



ఇటీవల కనుముకులలో పట్టుబడిన కల్తీ పాలు

భూదాన్‌పోచంపల్లి : హెచ్‌ఎండీఏ పరిధిలోని మండలాల్లో కల్తీ పాల దందా ఆగడం లేదు. పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నా అక్రమార్కులు యథేచ్ఛగా కృత్రిమ పాలు తయారీ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. గతంలో అక్రమార్కులు పాలలో పాల పౌడర్‌తో పాటు యూరియా, నూనె కలిపి కల్తీ పాలు తయారు చేయడం చూశాం. బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామంలో మాత్రం ఓ పాల వ్యాపారి మనుషుల శవాలను భద్రపరిచేందుకు వాడే ప్రాణాంతక ఫార్మాల్డిహైడ్‌ను కలుపుతున్నట్లు ఫుడ్ సెక్యూరిటీ అధికారుల మొబైల్ టెస్టింగ్ తనిఖీల్లో బట్టబయలు కావడం తీవ్ర ఆందోళన కల్గిస్తుంది. ఇలా గడిచిన ఎనిమిది నెలల్లో ఆయా మండలాల్లో పదుల సంఖ్యలో కల్తీ పాల కేసులు నమోదు అయ్యాయి. తాజాగా భూదాన్‌పోచంపల్లి మండలంలోని కనుముకుల, గౌస్‌కొండ గ్రామాల్లో కల్తీ పాల తయారీ గుట్టు రట్టయ్యింది.

రాజధానికి సమీప మండలాల్లో అధికంగా..
పాల దిగుబడి తగ్గి, మరోవైపు డిమాండ్ పెరగడంతో అక్రమార్కులు కల్తీ పాల తయారీపై మొగ్గు చూపుతున్నారు. లాభాల అత్యాశతో స్వచ్ఛమైన పాలను కల్తీ చేస్తూ వ్యాపారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ముఖ్యంగా ఈ దందా రాజధాని హైదరాబాద్‌కు చేరువలో ఉన్న హెచ్‌ఎండీఏ మండలాలైన భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, భువనగిరి, చౌటుప్పల్, బొమ్మలరామారం మండల్లో జోరుగా సాగుతుంది. వ్యాపారులు తెల్లవారు జామునే నగరాలకు పాలను రవాణా చేస్తుండటంతో అధికారుల నిఘాలేక కల్తీ పాల వ్యాపారం అక్రమార్కులకు మూడు పువ్వులు, ఆరు కాయలుగా చందంగా మారింది.

రసాయనాలు కలిపి మూడింతలు
వ్యాపారులు గ్రామాల్లో రైతుల నుంచి గేదెల పాలను లీటరు రూ.40నుంచి రూ.45లకు కొనుగోలు చేస్తున్నారు. వీటిలో నీళ్లు, పాల పౌడర్, ఇతర రసాయనాలు కలిపి మూడింతలు చేస్తున్నారు. అనంతరం వీటిని ఆటోలు, ట్రాలీలు, ద్విచక్ర వాహనాలపై హైదరాబాద్‌లోని హోటళ్లు, స్వీటు షాపులు, గృహాలకు సరఫరా చేస్తూ లీటరు రూ.60 నుంచి రూ.80కి విక్రయిస్తున్నారు. అయితే ప్రజలు గ్రామాల నుంచి వచ్చే పాలు స్వచ్ఛమైనవని భావించి కొనుగోలు చేసి తాగుతున్నారు.

దుష్పరిణామాలు
హైడ్రోజన్ ఫెరాక్సైడ్, ఫార్మాల్డిహైడ్, సుక్రోజ్, నూనె, యూరియా, సర్ఫ్, బేకింగ్ సోడా, యూరియా, పాలపొడి లాంటి రసాయన పదార్థాలను వినియోగించి కృత్రిమ పాలను తయారు చేస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో తెలిసింది. అయితే కల్తీ పాలను దీర్ఘకాలికంగా తాగడం వల్ల ప్రాణాంతక క్యాన్సర్, కాలేయం, మెదడు సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని డాక్టర్లు పేర్కొంటున్నారు.

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం



కల్తీ పాలను తాగడం వల్ల ముఖ్యంగా జీర్ణక్రియ, కండరాలు, నాడీ వ్యవస్థ, మెదడుపై పై తీవ్ర ప్రభావం చూపుతుంది. కల్తీ పాలలో వినియోగించే రసాయనాలు స్లో పాయిజన్‌గా మారి శారీరక, మానసిక సమస్యలు ఏర్పడుతాయి. జ్ఞాపకశక్తి మందగిస్తుంది. ఇక రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లలు, వృద్ధుల్లో ఈ ప్రభావం అధికంగా ఉంటుంది.
– డాక్టర్ శ్రీవాణి, వైద్యాధికారి, భూదాన్‌పోచంపల్లి

తనిఖీలు ముమ్మరం చేస్తాం

కల్తీ పాలను తయారు చేసి విక్రయించడం నేరం. గ్రామాల్లో కల్తీ పాలను తయారు చేసే వారిని గుర్తించేందుకు ముమ్మరంగా తనిఖీలు చేసి అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తున్నాం. అవసరమైతే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తాం. పాలు, ఇతర ఆహారపదార్థాలు కల్తీ చేస్తున్నట్లు తెలిస్తే ప్రజలు అధికారులకు సమాచారం ఇవ్వాలి.
– జ్యోతిర్మయి, జిల్లా జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

నమోదైన కేసులు కొన్ని..
- భూదాన్‌పోచంపల్లి మండలంలోని కనుముకుల, గౌస్‌కొండ గ్రామాల్లో పోలీసులు 350 లీటర్ల కల్తీపాలతో పాటు హైడ్రోజన్ ఫెరాక్సైడ్, స్కిమ్డ్ పాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.
- భీమనపల్లి, కనుముకుల గ్రామాల్లో 450 లీటర్ల కల్తీపాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.
- భీమనపల్లిలో 80 లీటర్ల కల్తీపాలు
- జూలూరులో ఫుడ్ సేఫ్టీ అధికారులు 300 లీటర్ల కల్తీ పాలు
- కప్రాయిపల్లిలో 80 లీటర్ల కల్తీపాలు, హైడ్రోజన్ పెరాక్సైడ్
- ఇంద్రియాలలో 200 లీటర్ల కల్తీపాలు
- భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్, బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లిలో 400 లీటర్ల కల్తీ పాలు
- బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామానికి చెందిన ఓ వ్యాపారి తన పాలసెంటర్‌లో పాలు విరిగిపోకుండా, అలాగే ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు ఫార్మాల్డిహైడ్ రసాయనాన్ని వాడుతున్నట్లు వెల్లడైంది.
- భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపూర్‌లో కల్తీ పాలు పట్టుబడ్డాయి.
- చౌటుప్పల్ మండలంలోని అల్లాపురం 160 లీటర్ల కల్తీపాలను పోలీసులు పట్టుకొన్నారు.
- బొమ్మలరామారం చౌదరిపల్లిలో కల్తీపాల గుట్టు రట్టయ్యింది.

సమస్యల పరిష్కారానికే విజన్ భువనగిరి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న పీవీ శ్యాంసుందర్‌రావు

భువనగిరిటౌన్ : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడమే లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు అన్నారు. అందులో భాగంగానే 'విజన్ భువనగిరి–2024' పేరుతో కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం భువనగిరిలోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వివిధ రకాల సమస్యలు ఉన్నాయన్నారు. వీటిలో కొన్ని రాష్ట్ర పరిధిలోనివి కాగా మరికొన్ని కేంద్రం పరిష్కరించవలసినవి ఉన్నాయన్నారు. మరికొన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పరిష్కరించవలసిన సమస్యలు ఉన్నట్లు చెప్పారు. ఉదాహరణకు మూసీ ప్రక్షాళన.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కూడుకున్నదన్నారు. ఇటువంటి సమస్యలపై చర్చించేందుకు ఈనెల 29న భువనగిరిలో విజన్ భువనగిరి –2024 సదస్సు ఏర్పాటు చేస్తున్నామని, పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సదస్సుకు వివిధ రంగాలకు చెందిన సుమారు 1500 ప్రముఖులను ఆహ్వానించనున్నట్లు చెప్పారు. గుర్తించిన సమస్యల పరిష్కారానికి, ఈ ప్రాంత అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలపై వారి సూచనలు, సలహాలు తీసుకుంటామని పేర్కొన్నారు. 29న ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో సదస్సు ఉంటుందన్నారు. రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలకు గాను 16 సీట్లు గెలిచే విధంగా రాష్ట్ర, కేంద్ర కమిటీలు కార్యాచరణ సిద్ధం చేశాయన్నారు. ఇందులో భాగంగానే ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకునే కార్యక్రమానికి బీజేపీ శ్రీకారం చుట్టిందన్నారు. అదే విధంగా ప్రజల చెంతకు మోదీ పాలన పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అర్హులకు లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇప్పటికే భారత్ వికసిత్ సంకల్పయాత్ర ద్వారా కేంద్ర పథకాలను ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు రవీందర్, దాసరి మల్లేష్, దేవగౌడ్, చందామహేదర్‌గుప్తా, రత్నపురం బాలరాం, పిట్టల అశోక్, బుక్క దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

● సీఎం మీటింగ్‌లో కలెక్టర్



సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం సెక్రటేరియట్‌లో కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే, అదనపు కలెక్టర్ వీరారెడ్డి

హిందూధర్మం.. ప్రపంచానికి దిక్సూచి

- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

చౌటుప్పల్ : హిందూధర్మం ప్రపంచానికి దిక్సూచిగా నిలుస్తుందని, అలాంటి హిందూధర్మం గొప్పతనాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యతను యువత స్వీకరించాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కోరారు. చౌటుప్పల్ మండలంలోని అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన యజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజ శ్రేయస్సులో భాగస్వాములు కావాలన్నారు. భరతమాత కోసం రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా సంఘటితం కావాలని, మత మార్పిడిలను అడ్డుకోవాలన్నారు. గోవుల అక్రమ రవాణ పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు పాలెం వెంకటేష్, ప్రతినిధులు పంతంగి రంజిత్‌కుమార్, కల్లెట్ల అరుణ్‌సాగర్, యాట మహేందర్, బడుగు హరినాథ్, అంతటి సాయిరాజ్, గంజి విజయ్‌కుమార్, నల్ల ఉదయ్‌కిరణ్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తిభావం కలిగి ఉండాలి

రామగిరి(నల్లగొండ): ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని ప్రముఖ ప్రవచన కర్త ఉపన్యాస రత్న శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య స్వామి అన్నారు. నల్లగొండ పట్టణంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నల్లగొండలోని రామాలయంలో భక్తులకు తిరప్పావై ప్రవచనాలు బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిలో మనిషికి భగవంతుడు విలక్షణమైన జ్ఞానాన్ని ఇచ్చాడని, దాన్ని సంపద కోసం కాకుండా మోక్ష మార్గ సాధన కోసం వినియోగించుకోవాలన్నారు. గోదాదేవి ధనుర్మాస వ్రతాన్ని ఆచరించి ఉత్తమ ఫలితాలు పొందాలన్నారు. కార్యక్రమంలో స్థానాచార్యులు రామరంగాచార్యులు, యాదగిరి ఆచార్యులు, జనార్దనాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

● భక్తజన యాదాద్రి



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనం కోసం ఆదివారం ఆలయ వీధుల్లో బారులుదీరిన భక్తులు

నిర్మించి వదిలేశారు!

- మోత్కూరులో రూ.45 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- రెండేళ్లుగా నిరుపయోగం
- మార్కెట్ ఆదాయానికి గండి



నిరుపయోగంగా ఉన్న మడిగెలు

మోత్కూరు : మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కార్యాలయ స్థలంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ రెండేళ్లుగా నిరుపయోగంగా మారింది. ఈ కాంప్లెక్స్‌లోని మడిగెలను అద్దెకు ఇవ్వకపోవడంతో వ్యవసాయ మార్కెట్ ఆదాయం కోల్పోతోంది. 2018లో మార్కెటింగ్ శాఖ నిధులు రూ.45 లక్షలతో పది మడిగెలు నిర్మించారు. నవంబర్ 2021న పనులు పూర్తయ్యాయి. మార్కెట్ పరిధిలోకి మోత్కూరుతో పాటు ఆత్మకూరు(ఎం), గుండాల, అడ్డగూడూరు, మోటకొండూర్ మండలాలు వస్తాయి. మార్కెట్ యార్డుకు ఎదురుగా అద్దె గదుల కొరత తీవ్రంగా ఉంది.మడిగెలను అద్దెకు ఇస్తే డిమాండ్ పెరగనుంది. ఒక్కో మడిగెకు నెలకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు అద్దె వచ్చే అవకాశం ఉంది. అద్దెకు తీసుకునేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. గతంలో రెండు పర్యాయాలు టెండర్లు పిలిచినా వివిధ కారణాల వల్ల మార్కెటింగ్ శాఖ ఉపసంహరించుకుంది. ఇప్పటికైనా మార్కెట్ అధికారులు మడిగెలను అద్దెకు ఇచ్చే విధంగా చూసి ఆదాయం పెంచుకోవాలని పలువురు కోరుతున్నారు.

మరోసారి టెండర్లు ఆహ్వానిస్తాం



గతంలో రెండు పర్యాయాలు టెండర్లు పిలిచాం. పది మడిగెలకు ఐదారు టెండర్లు కూడా రాకపోవడంతో వేలం పాటలను శాఖాపరంగా రద్దు చేశాం. త్వరలో తిరిగి టెండర్లను ఆహ్వానిస్తాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
– కె.ఉమామహేశ్వర్, మార్కెట్ కార్యదర్శి, మోత్కూరు

అదనపు ఆదాయం వస్తుంది



మడిగెలను వినియోగంలోకి తీసుకొస్తే మార్కెట్‌కు అదనపు ఆదాయం సమకూరుతుంది. పట్టణంలో దుకాణాల కొరత ఉంది. మడిగెలను నిరుపయోగంగా ఉంచకుండా వెంటనే అద్దెకు ఇవ్వాలి.
– అన్నెపు వెంకట్, మోత్కూరు

వినియోగంలోకి తేవాలి



నూతనంగా నిర్మించిన మడిగలను వినియోగంలోకి తేవాలి. దీంతో మార్కెట్‌కు ఆదాయం సమకూరుతుంది. మార్కెటింగ్ అధికారులు మడిగెలను అద్దెకు ఇచ్చే దిశగా ప్రయత్నం చేయాలి. ఆదాయం కోల్పోకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలి.
– గుండు వెంకటనర్సు, మోత్కూరు

గంజాయి పట్టివేత?

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని పాతగుట్ట చౌరస్తాలో ఓ వ్యక్తి నుంచి గంజాయిని పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. ఆదివారం సాయంత్రం సమయంలో పాత బట్టలు అమ్ముతున్న ఓ వ్యక్తి ఆయన బండిలో గంజాయి పెట్టుకుని విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చిందని, దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

చట్టాలపై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న క్రాంతి కుమార్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సమాచార హక్కు చట్టం ప్రజావేదుల న్యాయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నెకంటి క్రాంతి కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎర్రచెరువుతండా, నెల్లికల్లు గ్రామాల్లో గిరిజన ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో శివశంకర్, రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, భద్రి, శివరాంప్రసాద్, శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నకిరేకల్: తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నకిరేకల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సునీత ఆదివారం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల చేసుకోవాలని కోరారు. వచ్చే నెల 6వ తేదీ దరఖాస్తుల స్వీకరణకు ఆఖరు అని వివరించారు.

ఎంఎస్‌పీ నల్లగొండ అధ్యక్షుడిగా బకరం శ్రీనివాస్ మాదిగ

నల్లగొండ టౌన్: మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడిగా నల్లగొండ పట్టణానికి చెందిన బకరం శ్రీనివాస్ మాదిగ నియమితులయ్యారు. ఆదివారం నల్లగొండలోని అంబేద్కర్ భవనంలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన కందుకూరి సోమన్న మాదగి సమక్షంలో పార్టీ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధికార ప్రతినిధిగా మడుపు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులుగా పోలేని యాదయ్య, జిల్లా తిరమలేష్‌మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా బొజ్జ చిన్నమాదిగ, ఎరసాని గోపాల్‌మాదిగ, జిల్లా కార్యదర్శిగా మారపాక గోపాల్, గడుసు సైదేష్, జిల్లా సహాయకార్యదర్శులుగా ఏర్పాల వెంకటయ్య, దుబ్బ సత్యనారాయణ, నలగంటి రమేష్, జిల్లా ప్రచార కార్యదర్శిగా వంగూరి ప్రసాద్, పెరిక లింగస్వామి మాదిగ ఎన్నికయ్యారు.


కార్యకర్తలకు అండగా ఉంటాం


చండూరులో మాట్లాడుతున్న కూసుకుంట్ల

చండూరు : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై కార్యకర్తలు అధైర్య పడొద్దని, అందరికి అండగా ఉంటామని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం చండూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మునుగోడు ప్రాంత అభివృద్ధి కోసం రూ.571 కోట్ల నిధులు ఉన్నాయని, ఆ డబ్బులతో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కోరారు. ఈ సమావేశంలో పాల్వాయి స్రవంతి, జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళవెంకన్న, పాటల వెంకన్న, కౌన్సిలర్లు కోడి వెంకన్న, అన్నెపర్తి శేఖర్, గుంటి వెంకటేశం, మంచుకొండ కీర్తి సంజయ్, కొండ్రెడ్డి యాదయ్య, గుర్రం వెంకట్‌రెడ్డి, తెలుకుంట్ల, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

● క్రిస్మస్ వేడుకలకు చర్చిలు జిగేల్


విద్యుత్ వెలుగుల్లో నల్లగొండ పట్టణం దేవరకొండ రోడ్డులోని మరియరాణి కెథిడ్రాల్ చర్చి


విద్యుత్ దీపాలంకరణలో భువనగిరిలోని అర్బన్ కాలనీ చర్చి


విద్యుత్ వెలుగుల్లో మఠంపల్లిలోని శుభవార్త చర్చి

శ్రీకృష్ణుడిగా.. గోవర్ధనగిరిధారిగా..


శ్రీకృష్ణుడి అలంకార సేవలో స్వామివారిని ఊరేగిస్తున్న ఆచార్యులు, ఈఓ, అనువంశిక ధర్మకర్త


గోవర్ధనగిరిధారి అలంకార సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

- భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీ నారసింహుడు
- వైభవంగా రెండో రోజు అధ్యయనోత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో అధ్యయనోత్సవాలు పాంచరాత్ర ఆగమశాస్త్రనుసారంగా రెండవ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం శ్రీస్వామి వారిని శ్రీకృష్ణుడు (వేణుగోపాలస్వామి) అలంకారంలో తీర్చిదిద్దారు. అంతకు ముందు నిత్యారాధనలు చేపట్టి, దివ్య ప్రబంధ పారాయణం పారాయణికులచే గావింపజేశారు. స్వామి వారిని ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, పారాయణికులు, వేద పండితుల మంత్ర పఠనాల నడుమ భాజాభజంత్రీలతో మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండంలో స్వామివారిని అధిష్ఠించి పారాయణం చేశారు.

రాత్రి వేళ..

అధ్యయనోత్సవాల్లో భాగంగా సాయంకాలం వేళ ఆలయంలో ద్రావిడ ప్రబంధ సేవా కాలం పారాయణికులచే నిర్వహించారు. అనంతరం శ్రీస్వామిని గోవర్ధనగిరిధారిగా అలంకరించి ఆలయ తిరు, మాఢ వీధుల్లో ఊరేగించారు. మాఢ వీధుల్లో శ్రీస్వామి వారు ఊరేగుతున్న సమయంలో భక్త జనులు కనులారా వీక్షించి, మొక్కుకున్నారు. అనంతరం శ్రీస్వామి వారి అలంకార విశిష్టతను ఆచార్యులు భక్తులకు వివరించారు. ఆయా వేడుకల్లో ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, ఆచార్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెర్వులో గల్లంతైన రైతు మృతి


ప్రతాపరెడ్డి మృతదేహం

మోతె : మోతె మండల పరిధిలోని విభళాపురం గ్రామ చెరువులోకి ఎండ్లబండి దూసుకుపోయిన ఘటనలో గల్లంతైన రైతు మృతిచెందాడు. అతడి మృతదేహం ఆదివారం లభ్యమైంది. విభళాపురం గ్రామానికి చెందిన మైనంపాటి ప్రతాపరెడ్డి(55) శనివారం అదే గ్రామానికి చెందిన గుర్రం వెంకట్‌రెడ్డి పొలం దున్ని సాయంత్రం తిరిగి ఇంటికి వస్తున్నాడు. మార్గమధ్యలో గ్రామ శివారులో గల ఊర చెరువులోకి ప్రమాదవశాత్తు ఎండ్లబండి దూసుకుపోవడంతో నీటిలో ప్రతాపరెడ్డి గల్లంతయ్యాడు. చేపలు పట్టే తెప్పలతో చెరువులో గాలించగా ఆదివారం అతడి మృతదేహం లభ్యమైందని పోలీసుల తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

తిరుపతిలో అర్వపల్లి వాసి హఠాన్మరణం


లక్ష్మీనారాయణ (ఫైల్)

అర్వపల్లి: వైకుంఠ ఏకాదశి వేడుకలు తిలకించడానికై తిరుమల తిరుపతికి వెళ్లిన ఓ వ్యాపారి గుండెపోటుతో మృతిచెందాడు. జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకుడు, వ్యాపారి చిల్లంచర్ల లక్ష్మీనారాయణ (60) కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి తిరుపతికి బయలుదేరాడు. శనివారం అలివేలు మంగాపురం, ఇతర ఆలయాలకు వెళ్లి స్వామిని దర్శించుకొని తిరుమలకు వెళ్లే క్రమంలోనే లక్ష్మీనారాయణకు గుండెనొప్పి రావడంతో వెంటనే స్థానిక ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో ప్రత్యేక వాహనంలో ఆదివారం ఆయన మృతదేహాన్ని అర్వపల్లికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

మిర్యాలగూడ టౌన్ : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. మిర్యాలగూడ మండల పరిధి శ్రీనివాసనగర్‌లో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామానికి చెందిన వ్యాపారి చిలుకూరి వెంకటేశ్వర్‌రావు తన కుమారుడికి డెంగీ రావడంతో ఈ నెల 18న హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఆదివారం వెంకటేశ్వర్‌రావు ఇంటి డోరు తెరిచి ఉండటంతో స్థానికుడు సుధాకర్ గమనించి సమాచారం ఇచ్చాడు. వెంకటేశ్వర్‌రావు గ్రామానికి తిరిగి వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్నా 40 గ్రాముల రుద్రాక్షహారం, 35 గ్రాముల రెండు బంగారు చైన్లు, 20 గ్రాముల నల్లపూసల గొలుసు, ఉంగరం, నవరత్నం ఉంగరం, చెవి కమ్మలు నాలుగు జతలు, లక్ష్మీదేవి ఉంగరం, మూడు బంగారు చూట్లు, ఒక జత చెవి దిద్దుల బంగారంతో పాటు కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. బాధితుడు ఇచ్చిన సమాచారం మేరకు మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, సీఐ ముత్తినేని సత్యనారాయణ, ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

● కాపాడి ఒడ్డుకు చేర్చిన యువకుడు

సూర్యాపేట క్రైం : చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను ఓ యువకుడు కాపాడి ఒడ్డుకు చేర్చాడు. ఆత్మహత్య చేసుకునేందుకు ఆదివారం సూర్యాపేట పట్టణంలోని సద్దలు చెరువులోకి వివాహిత దూకింది. అటువైపుగా వెళ్తున్న జమ్మిగడ్డకు చెందిన గండరపు నవీన్ గమనించి చెరువులోకి దూకి కాపాడాడు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ విజయవాడకు చెందిన హారికగా గుర్తించి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అఘాయిత్యానికి గల కారణాలు వెల్లడించేందుకు హారిక ఇష్టపడలేదని స్థానికులు తెలిపారు.

వ్యవసాయ బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

గుర్రంపోడు : వ్యవసాయబావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గుర్రంపోడు మండలం తానేదార్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలోజు రాములమ్మ(70)కు ఇద్దరు కుమారులు ఉండగా అందరూ కలిసి ఒకే ఇంటిలో ఉంటున్నారు. ఉదయమే ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాములమ్మ తిరిగి రాకపోవడంతో వెదుకుతుండగా గ్రామ శివారులోని వ్యవసాయబావిలో విగతజీవురాలై కనిపించింది. గుర్తించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వృద్ధాప్యంతో అనారోగ్య సమస్యలతో బాధపడుతూ తాను ఎవరికీ భారం కాకూడదనే ఉద్దేశంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పోస్టాఫీసులో డిపాజిట్ డబ్బులు పోయాయని..

● గుండెపోటుతో వృద్ధుడు మృతి

నాగార్జునసాగర్ : పోస్టాఫీసులో డిపాజిట్ డబ్బులు పోయాయని మనస్తాపంతో ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన నాగార్జునసాగర్‌లోని పైలాన్‌కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. ఇటీవల పైలాన్‌కాలనీలోని సబ్‌పోస్టాఫీసులో కోటిరూపాయల మేర ప్రజల డిపాజిట్లను పోస్టుమాస్టర్ డ్రా చేసుకుని వెళ్లిన ఘటన తెలిసిందే. పైలాన్‌కాలనీకి చెందిన గుండా మల్లికార్జున్(66)అదే పోస్టాఫీసులో సుమారుగా ఐదులక్షల మేర డిపాజిట్ చేసినట్లు సమాచారం. వారం రోజులుగా మానసికంగా ఇబ్బందులు ఎదుర్కుంటూ తీవ్ర మనస్తాపానికి గురైన మల్లికార్జున్‌కు గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు.

నాటు కోళ్లు అపహరణ

ఆత్మకూరు(ఎం): గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ బావి వద్ద ఉన్న నాటుకోళ్లను అపహరించారు. ఈ ఘటన ఆత్మకూరు(ఎం)మండలంలోని కొరటికల్‌లో ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. కొరటికల్ గ్రామ శివారులో లగ్గాల సోమయ్య వ్యవసాయ బావి ఉంది. శనివారం రాత్రి వ్యవసాయ బావి వద్ద ఉన్న ఇంటి కిటికీని దుండగులు ధ్వంసం చేసి 100 నాటు కోళ్లను అపహరించుకు పోయారు. ఆదివారం ఉదయం బావి వద్దకు పోయిన లగ్గాల సోమయ్య చోరీ విషయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దొమ్మేటి నాగరాజు తెలిపారు.

జైనిమల్లయ్య జీవితం ఆదర్శప్రాయం

● ప్రొఫెసర్ హరగోపాల్


మల్లయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హరగోపాల్

భువనగిరిటౌన్ : తెలంగాణ సాయుధ రైతాంగ విప్లవ పోరాట యోధుడు జైని మల్లయ్య జీవితం ఆదర్శప్రాయమని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. మల్లయ్య ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం భువనగిరిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి హరగోపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషులు మార్పు, విలువల కోసం జీవించాలని కోరారు. భిన్న మత విశ్వాసాలు ఉన్న వారందరినీ సమానంగా గౌరవించాలన్నారు. అదే లౌకిక వాదన భావన అన్నారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు కొమ్మిడి నరసింహారెడ్డి , జైని రమేష్‌తో పాటు కుటుంబ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ ఆత్మహత్య


శారద (ఫైల్)

భువనగిరి క్రైం : అదృశ్యమైన మహిళ ఉరేసుకుని బలవన్మరణానికి పాలడింది. భువనగిరి మండలం రెడ్డినాయక్‌తండాకు చెందిన భూక శారద (25) ఆస్పత్రికి వెళ్తున్నానని కుమారుడికి చెప్పి ఈ నెల 8న ఉదయం 10గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 15న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. 16 రోజుల అనంతరం శారద రెడ్డినాయక్ తండాలోనే ఓ మామిడి చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా వేలాడుతుండడాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. శారద ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యాదాద్రి క్షేత్రంలో భక్తుల రద్దీ


ప్రధానాలయం వీధుల్లో భక్తుల కోలాహలం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో శ్రీస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో యాదాద్రీశుడి చెంతకు తరలివచ్చారు. దీంతో క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, మాఢ వీధులు, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణకట్ట, బస్టాండ్లు, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం వంటి ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. భక్తులు అధికంగా రావడంతో క్యూలైన్లలో, కొండపైకి, కొండ కిందికి వెళ్లే బస్సుల్లో ఇబ్బందులు పడ్డారు. ఇక శ్రీస్వామి వారి ధర్మదర్శనానికి మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంటన్నర, బ్రేక్ దర్శనానికి 30 నిమిషాల సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. శ్రీస్వామిని 40వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్య ఆదాయం రూ.56,65,442 వచ్చినట్లు అధికారులు తెలిపారు.

పసుపు అట్టలతో పంటల సస్యరక్షణ ఇలా..

పాడి పంట

నడిగూడెం : పంటల సాగులో పురుగు మందుల వినియోగం విపరీతంగా పెరిగింది. దేశంలో ప్రస్తుతం 1.50 లక్షల టన్నులకు పైగా పురుగు మందులు ఉపయోగిస్తున్నట్లు వ్యవసాయాధికారులు లెక్కలు చెబుతున్నాయి. దేశంలో హెక్టారుకు సగటు 0.5 కిలోలు, జపాన్‌లో కిలో పురుగు మందులు వాడుతున్నట్లు తెలుస్తోంది. సమగ్ర సస్యరక్షణ చర్యలతో పురుగు మందుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్ రైతులకు సూచిస్తున్నారు.

సస్యరక్షణ పద్ధతులు..


సాగు పద్ధతి, యాంత్రిక, జీవ నియంత్రణ పద్ధతులు. పర్యావరణరహిత పురుగు మందులు యాంత్రిక పద్ధతిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొంటున్నారు.

పసుపు పచ్చ అట్టల పాత్ర

టమాట, మిరప తదితర పంటల్లో తెల్లదోమ, పచ్చదోమ, రసం పీల్చు తామర పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. మిరప పంటకు తెల్లదోమ సోకడంతో జెమిని వైరస్, కుకుంబర్ మొజాయిక్ వైరస్ పెరిగి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఏ రకైన పురుగునైనా ఆకర్షించే గుణం పసుపుపచ్చ రంగు అట్టలకు ఉంటుంది. ఈ అట్టలను కట్టెలకు ఏర్పాటు చేసి, సాళ్ల వెంట క్రమపద్ధతిలో అమర్చి వాటికి జిగురు లేదా గ్రీజు పూస్తే తెల్ల, పచ్చ దోమతో పాటు, ఎర్ర నల్లి, తామర పురుగు అంటుకొని చనిపోతాయి. దీనితో ముడత తెగులు పూర్తిగా తగ్గిపోతుంది. పురుగు మందులు వాడకుండా, అతి తక్కువ ఖర్చుతో రసం పీల్చే పురుగును నియంత్రించే ఈ మ్యాజిక్ అట్టలు ఎకరానికి 20 నుంచి 30 వరకు అమర్చుకోవాలి. దీనికి దాదాపు వెయ్యి రూపాయలు ఖర్చు అవుతుంది.


నారాయణపురం వద్ద మిరప పంటలో ఏర్పాటు చేసిన పసుపు రంగు అట్టలు


సుందరి సురేష్, సీనియర్ హార్టికల్చర్ కన్సల్టెంట్


పసుపు అట్టకు అతుక్కొని చనిపోయిన రసం పీల్చే పురుగులు